

విలువిద్యలో మెరిసిన శ్రీ మోదమాంబ హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని శ్రీ మోదమాంబ హైస్కూల్ విద్యార్థినీలు 'జాతీయ క్రీడ దినోత్సవం'ని పురస్కరించుకుని విశాఖపట్నం, కొమ్మాదిలో నిర్వహించిన జోన్-ఎ విలువైద్య పోటీలో విద్యార్థులు వూడి యశస్వి (కాంస్య పతకం), వంతల కీర్తి పాల్గొని అత్యున్నత ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని శనివారం ఈ పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది హర్షం వ్యక్తం చేసారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్

గిరిజనులకు ప్రత్యామ్నాయంగా భూములివ్వాల్సిందే

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : పోలవరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, గిరిజనులకు ప్రత్యామ్నాయంగా భూములివ్వాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. శనివారం కలెక్టరేట్ నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులు, తహశీల్దారులు, పోలవరం పరిపాలనాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు ప్రత్యామ్నాయ భూములు సేకరణ, పునరావాసంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. పునరావాస కాలనీలకు ప్రజలను తరలించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటీవల వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించినపుడు పునరావాస కాలనీలకు విద్యుత్తు, మంచినీటి సదుపాయాలు లేవని సంబంధిత ప్రజలు తన దృష్టి తీసుకుని వచ్చారన్నారు. పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ఇంకా 4500 ఎకరాల భూమిని సమీకరించాలన్నారు. రైతులకు వ్యవసాయం చేయడానికి అనువుగా ఉన్న భూములను సమీకరించాలని చెప్పారు. పునరావాస కాలనీలకు దూరంగా రైతులకు భూములు కేటాయిస్తే ప్రయోజనం ఉండదని, గ్రామాలకు రెండు మూడు కిలోమీటర్ల దూరం 56 వ్యవసాయానికి భూములను కేటాయిం చాలని సూచించారు. జీలుగు మిల్లి, బుట్టాయ గూడెం, కుక్కనూరు గ్రామాల్లో భూములు సేకరించాలని ఆదేశించారు. ఇందుకూరు పేట గ్రామానికి స్మశాన వాటికకు భూమిని సేకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో పోలవరం పరిపాలనాధికారి వి. అభిషేక్, రంపచోడవరం ఐటిడి ఏ పి ఓ కె. సింహచలం, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు పి ఓ అపూర్వ భరత్, ప్రత్యేక ఉప కలెక్టర్ అంబేద్కర్, చింతూరు, రంపచోడ వరం డివిజన్ల పరిధిలో పలువురు తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మి, పులి సంతోష్‌కుమార్



బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు, ఎంపిపి

ప్రజాశక్తి - విఆర్ పురం: వరద ముంపు ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ శుభంనొక్వాల్‌తో కలసి ఎంపిపి కారం లక్ష్మి రేఖపల్లి పంచాయతీలోని పునరావాస కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌తో ఎంపిపికారం లక్ష్మి మాట్లాడుతూ ముంపునకు గురైన కుటుంబాలే కాకుండా రహదారులు బంద్ అయి రాకపోకలు నిలిచిపోయిన గ్రామల్లోని కుటుంబాలకు కూడా రామవరం నుంచి జీడిగుప్ప, శ్రీరామగిరి, వడ్డుగూడెం గ్రామాలకు నిత్యావసర సరుకులు ఇవ్వాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ శుభంనొక్వాల్ అందరికీ నిత్యావసరాలు అందిస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట సిపిఎం నాయకులు, తహశీల్దార్ సరస్వతి, ఎంపిడిఒ ఇమాన్యుయేల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకుల పరామర్శ

రేఖపల్లిలోని పునరావాస కేంద్రాల్లోని బాధితులను వడ్డుగూడెం కాలనీలో బాధితులను సిపిఎం నాయకులు పరామర్శించారు. ఎఎస్‌డిఎస్ డైరెక్టర్ గాంధీబాబు ఆధ్వర్యంలో సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ టార్పాలిన్ దోమతెరలు, నిత్యావసర సరుకులు బాధితులకు అందించారు. సిపిఎం మండల కార్యవర్గసభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, రెవెన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఎఎస్‌డిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు అనుమతి ఇచ్చింది బిజెపి కాదా?

-ఆ పార్టీ అధ్యక్షులు మాధవ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం - సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీ పర్యటనకు వచ్చిన బి.జె.పి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ వామపక్ష పార్టీలను నిలదీయాలని చేసిన వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనరస శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1/70 చట్టాన్ని బిజెపి రద్దు చేస్తుందని ప్రచారం చేస్తున్న వామపక్ష పార్టీలను నిలదీయాలంటూ విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. 370 ఆర్టికల్ ను బిజెపి రద్దు చేయలేదా? అని ఆయన ప్రశ్నించారు.కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి తోనే హైడ్రో పవర్ ప్రాజెక్టును నిర్మించడానికి అదాని వంటి కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాల భూములు ఏజెన్సీ ప్రాంతంలో కేటాయించడం, 1/70 చట్టాన్ని దిక్కరించడం కాదా? అని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతం లో కార్పొరేట్ కంపెనీలకు అనుమతి లేదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా విచ్చలవిడిగా కార్పొరేట్ ప్రైవేట్ కంపెనీలకు వివిధ ప్రాజెక్టుల పేరుతో అప్పగిస్తున్నారని విమర్శించారు. చట్టం ఉంటూనే నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రద్దయిన జీవో 3 సందర్భంలో కూడా బిజెపి వైసిపి ప్రభుత్వాలు ఉన్నాయని, ఆ తర్వాత కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రములో సుమారు కోటి మంది ఆదివాసీల ఉద్యోగ రిజర్వేషన్ రద్దు అయితే మోడీ ప్రభుత్వం కనీసం పునరుద్ధరణకు ఎటువంటి ప్రయత్నం చేయలేదని దుయ్యబట్టారు.. వేలాది మంది ఆదివాసీ నిరుద్యోగులు మెగా డిఎస్‌సి టీచర్స్ పోస్టుల కోసం పోరాటం చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

వరద తగ్గినా రాకపోకలు లేవు

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని దిగువన కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగటంతో విఆర్‌పురం మండలంలోని అడివివెంకన్న గూడెం, తుస్తివారిగూడెం, చింత రేగుపల్లి, కన్నాయిగూడెం, శ్రీరామగిరి, సీతంపేట గ్రామాల మధ్య రోడ్లపై వరద రావడంతో ఐదు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. వీఆర్ పురం, చింతూరు మధ్య సోకులేరు వాగు పొంగటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వీఆర్ పురం నుంచి భద్రాచలంకి రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం సాయంత్రం 4 గంటలకు 36.30 అడుగులకు తగ్గడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు జరిగాయి. సీతంపేట నుండి శ్రీరామ్‌గిరి మార్గంలో వరద మాత్రం తగ్గకపోవడంతో విఆర్‌పురం నుండి చింతూరు సోకలేరు వాగు వరద తగ్గకపోవడంతో రాకపోకలు నిలిచాయి. ముంపు గ్రామాల ప్రజలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాకు ఇదే పరిస్థితి ఏర్పడుతోందని ఐదు రోజుల నుండి రాకపోకలు లేకపోవడంతో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

చింతూరు: చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం భారీగా తగ్గడంతో కొయూరు వాగు శాంతించింది. దీంతో ఒడిస్సా ఆంధ్ర చత్తీస్‌గఢ్ రాష్ట్రాల రహదారుల్లో రాకపోకలు ప్రారంభమయ్యాయి. సోకలేరు వాగు తగ్గకపోవడం తో చింతూరు విఆర్ పురం మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడలేదు.

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో గల ఎస్సీ యువతీ యువకులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్లో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ శనివారం తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఇరవై సంవత్సరాల వయస్సు పైబడిన ఐదుగురు పురుషులు, ఐదుగురు స్త్రీలకు నలభై రోజుల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు. ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. అర్హులైనవారు షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నంలో గల కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

గుండెపోటుతో విఆర్ఓ మృతి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: కూనవరంమండలం, చూచిరేవుల గూడెం విఆర్ఒ పండా అనోజ్‌కుమార్ శనివారం విధి నిర్వహణలోనే గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందారు. శుక్రవారం రాత్రి గోదావరి వరద విధులు ముగించుకొని, తన గదిలో నిద్రించిన అనోజ్‌కుమార్ ఉదయం ఎంతకూ బయటకు రాకపోవటంతో, సహచర ఉద్యోగులు తలుపులు తీసి చూశారు. అప్పటికే ఆయన అపస్మారకస్థితిలో పడిఉన్నాడు. సహచర ఉద్యోగులు హుటాహుటిన కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం అనోజ్‌కుమార్ మృతదేహాన్ని వేలేరుపాడు మండలం, రామవరం గ్రామానికి తరలించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య భారతి, ఇద్దరు పిల్లలున్నారు. వి.ఆర్.పురం మండలం, చిన్నమట్టపల్లి గ్రామానికి చెందిన అనోజ్‌కుమార్ రెవెన్యూశాఖలో ఉద్యోగం రాకముందు 2004 నుండి 2008 మధ్యకాలంలో వి.ఆర్.పురం విశాలాంధ్ర విలేకరిగా పనిచేశారు. ఆయన అకాలమృతిపై పలువురు సంతాపం తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు

ప్రజాశక్తి- విఆర్ పురం : వరదలు తగ్గడంతో మండలంలోని వరి సాగుకు రైతాంగం సన్నద్ధం అయ్యారు. ఉమ్మడివరం, సున్నవారిగూడెం, వి అర్ పురం, పెద్దమట్టపల్లి తదితర గ్రామాల్లో వరి నాట్లు ప్రారంభం అవడంతో కూలీలకు పనులు మొదలయ్యాయి. సన్న చిన్న కారు రైతులు తమకున్న కొద్దిపాటి భూమిలో ఇప్పుడు వరి నాటు వేస్తున్నారు. మిర్చి విత్తనాలు కూడా వేస్తున్నారు. వరదలు మళ్లీ వస్తే వరికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చవితి మండపాలకు అనుమతులు పొందాలి

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో సిఐ నరసింహమూర్తి, ఎస్ఐ వినోద్ అడ్డతీగల మండలంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండపాలు నిర్వహించేవారు కచ్చితంగా పోలీస్ గవర్నమెంట్ సైట్ https://ganeshutsav.net నందు లాగిన్ అయ్యి నియమాల ప్రకారం అనుమతి పొందాలన్నారు. పంచాయతీ అనుమతి పొందాలని ప్రైవేట్ స్థలం అయితే స్థల యజమాని అనుమతిపత్రం పొందాలన్నారు. ఎలక్ట్రిసిటీ వారి అనుమతి పొందాలన్నారు. నిమజ్జనం చేసేటప్పుడు కూడా ముందుగా పోలీస్‌సిబ్బందికి వివరాలు తెలియజేయాలన్నారు.

టంగుటూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-పాడేరు : ఆదర్శప్రాయులు ఆంధ్ర కేసరి అని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర మద్రాస్ మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను గుర్తు చేసారు. పేదరికంలో పుట్టిన టంగుటూరి ఉన్నత చదువులు చదవడమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్ వారిని ధైర్యంగా ఎదుర్కొని ఆంధ్రకేసరిగా పేరు పొందారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన పేరును ఒక జిల్లాకు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్

అన్ని గ్రామాలకు నిత్యావసర సరుకులు ఇవ్వాలి

ప్రజాశక్తి-కూనవరం: శబరి కొత్తగూడెం గ్రామంలో సిపిఎం నాయకులు శనివారం పర్యటించారు. గ్రామస్తులు తమకు నిత్యావసర వస్తువులు ఎవరూ ఇవ్వలేదని వాపోయారు. జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ ముంపునకు గురైన అన్ని గ్రామాలకు నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి బాబుబొర్రయ్య, పాయం సీతారామయ్య,సర్పంచ్ మడకం నాగమణి,మోసం తమ్మయ్య,కట్టి సాంబయ్య, మోసం సాంబయ్య, సున్నం రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ఈగల్‌టీం ఇన్‌స్పెక్టర్ సూర్యమోహనరావు

'మత్తు పదార్థాలకు బానిసకావొద్దు'

ప్రజాశక్తి -సీలేరు: మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ సూర్యమోహనరావు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా ఈగల్ టీం ఆధ్వర్యంలో శనివారం డ్రగ్స్‌వద్దుబ్రో అనే కార్యక్రమాన్ని స్థానిక ఎపి జెన్‌కో కల్యాణ మండపంలో నిర్వహించారు. సూర్యమోహనరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు అయి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యుత్ ఉద్యోగుల ఉద్దేశించి మాట్లాడుతూ మీరు సామాజిక బాధ్యతగా గంజాయి డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాలను 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎపి జెన్కో ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ రాజేంద్రప్రసాద్, సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారి వెంకటరావు, డిఎవి జిల్లా పరిషత్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

ప్రజాశక్తి-అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆశా కార్యకర్తల ఉద్యోగ నియామకానికి దళారీలు, మధ్యవర్తులు కాసుల పంట పండిస్తున్నారని వస్తున్న వదంతుల నేపథ్యంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా అర్హులైన వారికే ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 124 ఆశ కార్యకర్తల ఉద్యోగ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించారన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ ఒక ఆశ కార్యకర్త ఉద్యోగ పోస్టుకు స్థానిక వైద్యాధికారి, పంచాయతీ సర్పంచ్‌తో కూడిన కమిటీ ముగ్గురు పేర్లు సిఫార్సు చేశారన్నారు. అర్హులైన వారికి సిఫార్సు చేసిన ముగ్గురిలో ఒకరికి ఆశా కార్యకర్త ఉద్యోగం వచ్చే అవకాశం ఉందన్నారు. 124 ఆశా కార్యకర్తల పోస్టులకు సిఫార్సు చేయబడిన 372 దరఖాస్తులు మాత్రమే డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయానికి పంపించారన్నారు.ఈ జాబితాకు సంపాదించిన కొంతమంది దళారులు మధ్యవర్తులు ఒక్కొక్క ఆశ కార్యకర్త ఉద్యోగానికి లక్షల రూపాయలు డిమాండ్ చేస్తూ డబ్బులు ఇచ్చిన వారికే ఉద్యోగాలు వస్తాయని ఆశలు రేకెత్తించి వారి నుంచి డబ్బులు దండుకుంటున్నారని ఆయన అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, సంబంధిత వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి అర్హులైన వారికి పారదర్శకంగా ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా తక్షణమే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అర్హులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడ్డారు. పోస్టులు ఇప్పిస్తామని ఫోన్ల ద్వారా సంప్రదించే వారిపై నిఘా ఉంచి అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి తరుణంలో ఆశా అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు

ప్రజాశక్తి - గంగవరం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనం నడిపినా కఠినచర్యలు తప్పవని గంగవరం ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. శనివారం బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధగా వాహనాలు నడిపిన వారిపై కూడా కేసులు నమోదు చేశామన్నారు.

మహిళల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి

-మహాసభలో గిరిజన మహిళా సంఘం నేతలు



మాట్లాడుతున్న భాగ్యవతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మహిళల హక్కులు, చట్టాలు పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని అస్సావ్ బ్యాంక్ సొసైటీ డైరెక్టర్ భాగ్యవతి అన్నారు. శనివారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో గిరిజన మహిళా సంఘం (అఖిల భారత ప్రజాతంత్ర ఐద్వా) మండల మూడవ మహసభ ఘనంగా జరిగింది.ఈ మాసభకు ముఖ్యఅతిథిగా అస్సావ్ బ్యాంక్ సొసైటీ డైరెక్టర్ జి భాగ్యవతి హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా స్త్రీలు ఎప్పటికీ సమాజంలో అణిచి వేతలకు గురి అవుతున్నారన్నారు. స్త్రీలు ఎప్పుడైతే అర్ధరాత్రి నడిరోడ్డుపై నడుస్తారో అప్పుడే దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టునని ఆనాటి గాంధీ మాటలు స్మరించుకుంటూ ఈనాటికి దేశంలో,రాష్ట్రంలో స్త్రీలు అణిచివేతలు గురి అవుతూనే ఉన్నారని తెలిపారు.ప్రతి ఆడపిల్లకు సంపూర్ణమైన విద్య అందిస్తే స్వతంత్రంగా నిలబడేలాగా ఉద్యోగాలు చేస్తూ ముందుకు వెళ్తారని ఆమె అన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వివి జయ మాట్లాడుతూ దేశంలో స్త్రీలకు సమానత్వం సాధనకై ఐద్వా మహిళా సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.దేశంలో రోజురోజుకు పెరుగుతున్న మద్యాన్ని అరికట్టాలని , స్త్రీలపై జరిగే అత్యాచారాలు , కులావిచక్షణ , హత్యలు అరికట్టే విధంగా నిందితులకు కఠిన శిక్షలు విధించేలా చట్టంలో మార్పు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహిళలకు పని ప్రదేశాలు లైంగిక వేధింపులు అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఐద్వా నూతన మండల కమిటీ ఎన్నిక.

అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో శనివారం ఐద్వా మహిళా సంఘం మూడవ మహాసభ జరిగింది. ఈ సభలో నూతన కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్షులుగా జి సుమిత్ర, కార్యదర్శిగా కిల్లో శశికళ, 8 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల అధ్యక్షులు బాలయ్య

రోడ్డు విస్తరణలో నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-జికెవీధి: మండలంలో పెదవలస పంచాయతీ ఉన్న పలు గ్రామాల నుంచి సచివాలయంలో ఎన్‌హెచ్516 ఇ రోడ్డు వెడల్పు లో 74 మంది రైతులు కాఫీతోటలు భూములు నష్టపోయి ఉన్నారన్నారు. రైతులకు పూర్తిగా నష్టపరిహారం ఇచ్చేవరకూ రోడ్డు పనులు జరగనివ్వమని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు బాలయ్య డిమాండ్ చేశారు. మండల అధికారులు సమస్య పరిష్కారం చేయాలని కాఫీ రైతులు నాయకులను కోరారు.



రోడ్డు, డ్రెయినేజీలు కల్పించాలి

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన



ఆందోళన చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం మాడగడ పంచాయతీ దానిరంగిని గ్రామంలో సిసి రోడ్డు, డ్రైనేజీ సదుపాయం కల్పించాలని శనివారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు సత్యారావు, దామోదర్, మహదేవ్ మాట్లాడుతూ, దానిరంగిని గ్రామంలో మెయిన్ రోడ్డు నుండి ఊరు వరకు 190 మీటర్లు పొడవు సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా మా గ్రామంలో మాత్రం ఏ సదుపాయం కల్పించడం లేదని మండిపడ్డారు. సిసి రోడ్ సదుపాయం కల్పించాలని అనేకసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఎవ్వరు పట్టించుకున్న పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి సిసి రోడ్డు ,డ్రైనేజీ సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బొబురావు, గోవర్ధన్, గోవింద్, భూసేన్, గోపి చంద్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మహిళలు

తాగునీటి సమస్యపై వినతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని మాడగడ పంచాయతీ దానిరంగిని గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు ఆదివాసి గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం మహిళలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 40 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నారని, తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనల అనంతరం ప్రభుత్వం బోరు మంజూరు చేసి పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేసారన్నారు. తక్షణమే స్పందించి తాగునీరు సమస్య అందించే విధంగా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన తాగునీరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి వి విజయ, మండల కార్యదర్శి కిలో శశికళ, మండల కమిటీ సభ్యులు సునిత, ప్రమీల, కమల, సుశీల, సౌయిత ప్రతిమ, దన్ మొత్తి తదితరులు పాల్గొన్నారు.

ఐవిఎఫ్ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని ఐవిఎఫ్, ఫెర్టిలిటీ కేంద్రాలను డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన 7 మందితో కూడిన ఎఆర్‌టి, సరోగసి బృంద సభ్యులు పరిశీలించారు. డాక్టర్ నీరజాస్ మామ్స్ హోప్ ఫెర్టిలిటీ కేంద్రం, ఆరాధ్య ఐవిఎఫ్ కేంద్రం, రామ హాస్పిటల్, ఆకర్ష్ ఫెర్టిలిటీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డ్, స్కానింగ్ మెషిన్లను పరిశీలించారు. డాక్టర్లు, స్టాఫ్ విద్యార్హతలు, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో డాక్టర్లు విద్యారమ, రాధ, టి.కిషోర్, సోభశ్రీ, సోషియాలజిస్ట్ ఎల్‌వి.రమణి, కె.శివాజీ, డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటుకు ర్యాలీ



గోమంగి వారపు సంతలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పెదబయలు : గోమంగి కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని గోమంగి వారపు సంతలో శనివారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోమంగి మండల సాధన సమితి నాయకులు కొమ్మ పద్మనాభం, గోమంగి సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ ఎపి రాష్ట్ర ప్రభుత్వం 1983లో మండలాలు ఏర్పాటు చేసిందని, ఆ సమయంలో గోమంగి పంచాయతీకి విద్య, వైద్యం, రోడ్డు సదుపాయాలు లేకపోవడం, ఒడిశా సరిహద్దుల్లో ఉండటం వల్ల నాటి ప్రభుత్వం పెదబయలును మండల కేంద్రంగా ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం గోమంగిలో ఇన్ని సదుపాయాలు ఉన్నాయంటే అవన్నీ మండల సాధన సమితి పోరాట ఫలితంగానే వచ్చాయని పేర్కొన్నారు. నేడు వైద్యం, విద్య, రింగురోడ్డు సదుపాయం ఉన్నాయని, గోమంగి పంచాయతీకి ఆనుకొని 17 పంచాయతీలు ఉన్నాయని, వీటికి గోమాంగి కేంద్ర బిందువుగా ఉందని తెలిపారు. ఈ 17 పంచాయతీల ప్రజలు పెదబయలు చేరుకోవాలంటే సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించ వలసివస్తుందన్నారు. గోమంగి మండల సాధన సమితిని 1998లో ఏర్పాటు చేసి మండలం కోసం అనేక పోరాటాలు చేసియున్నామని చెప్పారు. బొయితిలి, కిల్లంకోట ఎఎన్ఎం, హెచ్‌డబ్ల్యూ లాంటి వారికి గోమంగిని సబ్ సెంటర్‌గా నిర్వహిస్తున్నారని, వారందరికీ గోమంగి సౌకర్యవంతంగా ఉందని పేర్కొన్నారు. అందువల్ల గోమంగిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేఘ నాగరాజు, గంపరాయి రాంబాబు, సునీల్, కృష్ణబాబు, మహేష్, భగీరథరావు, కే.మధు తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిలో ఆదివాసీ అభ్యర్థులకు అన్యాయం

ప్రజాశక్తి-చింతపల్లి : మెగా డీఎస్సీ-2025లో ఏజెన్సీ ప్రాంత గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ నిరుద్యోగుల జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. జిఓ నెంబర్ 3 రద్దు కావడంతో ఏజెన్సీలోని ఉద్యోగాలు కేవలం 6 శాతం మాత్రమే గిరిజన అభ్యర్థులకు లభిస్తున్నాయని, దీంతో వందలాది మంది గిరిజన అభ్యర్థులు అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు 9న పాడేరులో ఆదివాసీ దినోత్సవంలో జీవో నెంబర్ 3కు సమానమైన జీవోను తెస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని కోరారు. ఈ మేరకు సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు గిరిజన డీఎస్సీ అభ్యర్థులు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్‌ను కలిశారు. జీవో 3 రద్దు వల్ల తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శ్రవణ్ కుమార్ గిరిజన యువతకు న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంలో కోర్టులో పిల్ (పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్) దాఖలు చేస్తానని, ఈ కేసును తానే స్వయంగా స్వీకరిస్తానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తమ సమస్యపై సానుకూలంగా స్పందించకపోతే న్యాయపోరాటం తప్పదని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభ్యర్థులు డి.రాజు, టి.రవి, జి.రామలింగం, వి.చింతల్లి, మూర్తి పాల్గొన్నారు.



న్యాయవాది శ్రావణ్‌కుమార్‌ను కలిసిన గిరిజన డిఎస్‌సి అభ్యర్థులు

అంగన్వాడీల నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆయాల నూతన అధ్యక్ష కార్యదర్శిలు ఎన్నికలో ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ ఎన్నిక మండల సిఐటియు కార్యదర్శి కొర్ర శంకర్రావు, మాజీ నాయకులు కొర్ర త్రినాథ్‌ల సమక్షంలో శనివారం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నూతన అధ్యక్షురాలుగా వి గంగాభవాని, కార్యదర్శిగా ఎస్ ఈశ్వరి, కోశాధికారిగా కే.అమ్మాజీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి.సత్యవతి, కె.మౌలమ్మలు ఉపాధ్యక్షులుగా వి.దేవి, కె మంగ్లీ, కమిటీ సభ్యులుగా ముత్యాలమ్మ, చిలకమ్మ, పార్వతి, రాధిక, ఈశ్వరి, కుమారి, మితులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతామని, సిఐటియు పిలుపుమేర అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి దిశా నిర్దేశంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాటు సారా పట్టివేత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా పాడేరు మండలం వంట్ల మామిడిలో అక్రమంగా తరలిస్తున్న నాటు సారాను ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై 40 లీటర్ల నాటు సారాను తరలిస్తున్నారు.. అల్లూరి, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి ఎసి ఎన్ఫోర్స్ మెంట్ టీం వీరిని పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు నాటు సారా స్వాధీనం చేసుకుని నలుగురి నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ తనికిల్లో అల్లూరి, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి ఎసి ఎన్ఫోర్స్ మెంట్ టీం బి.జగదీశ్వర్రావు, వీర్రాజు, ఎమ్మెస్ రాజు, సిహెచ్ రమేష్, కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి అభిషేక్ గౌడ్

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-పాడేరు: బ్రహ్మ కుమారిస్ బికే విజయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో బ్రహ్మకుమారిస్ (ఓంశాంతి) నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రక్తపు నిలువలు అనేకమంది రోగులకు ఉపయోగపడుతుందని అన్నారు. రక్తదానం చేసేందుకు విరివిగా ఔత్సాహికులు ముందుకు రావాలని కోరారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర కళాకారుల సాంస్కృతిక శాఖ చైర్మన్ వంపూరు గంగులయ్యతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. టిడిపి పాడేరు నియోజకవర్గం ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి శిబిరాన్ని సందర్శించారు. 25 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర, రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, వైస్ చైర్మన్ గంగరాజు, కార్యదర్శి జి గౌరీ శంకర్ కోశాధికారి పి సూర్యరావు కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం,రవి, ప్రసాద్ నాయుడు, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గూడ గ్రామ పంచాయతీ పరిధిలో రైతులకు సిల్వర్ మొక్కలను ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్‌రావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పవన్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరపరా చేస్తున్న మొక్కలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల కోసం నమోదు చేసుకున్న రైతులందరికీ సరపరా చేయడం జరుగుతుందన్నారు. మొక్కలు నాటడంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కాపాడవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీవోలు లింగమూర్తి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రం పెదబయలులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో రూ.58 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం స్థానిక సర్పంచి పి.మాధవరావు, ఎంపీటీసీ కె.బొంజుబాబు, టిడిపి అధ్యక్షులు వి.కొండయ్య ప్రారంభించారు. దీనికి జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లి సుభద్ర హాజరు కావాల్సి ఉండగా, అనివార్యకారణాల వలన హాజరు కాలేదు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపిటిసి మాట్లాడుతూ సుమారు 900 మీటర్ల మేర సిసి రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని కోరారు.

రహదారిపై పశువులు వదిలేస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఏజెన్సీలో 516ఈ జాతీయ రహదారిపై పశువులు విచ్చలవిడిగా వదిలేస్తే యాజమాన్యపై జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు చర్యలు తప్పవని స్థానిక తహశీల్దార్ సత్యనారాయణ శనివారం తెలిపారు. కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులకు ఆదేశాల మేరకు పశువుల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు.అయినా వారి తీరు మారకపోతే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు పీసా చట్టంపై క్షేత్రస్థాయి సమావేశం

ప్రజాశక్తి - మారేడుమిల్లి: పీసా చట్టంపై క్షేత్రస్థాయి సమావేశం ఈ నెల 25వ తేదీన ఉదయం 10గంటలకు పుల్లంగా పంచాయతీ, అద్దారీవలస (చలక వీధి)లో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి డా. పల్లా శ్రీనాథ్‌రావు, లీగల్ కన్సల్టెంట్, గిరిజన సంక్షేమ శాఖాధికారులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపిడిఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.



స్థల పరిశీలన చేస్తున్న జెన్కో, అటవీశాఖాధికారులు

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో ఎపి జెన్కో అటవీశాఖ అధికారుల బృందం శనివారం విస్తతంగా పర్యటించారు. ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ సివిల్ రవీందర్‌రెడ్డి జెన్కో అధికారులు అటవీశాఖ రేంజ్ అధికారి వెంకటరావు ఆధ్వర్యంలో పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు అవసరమయ్యే డంపింగ్‌యార్డ్ స్థల పరిశీలన చేశారు. ఇటీవల దుప్పిలివాడ పంచాయతీ జొన్నమామిడి సమీపంలో అటవీ శాఖ స్థలంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు ఏపీ జెన్కో అనుమతులు కోరింది. అయితే కొన్ని అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో అటవీశాఖ అధికారులు జెన్కో అధికారులు బృందం జెన్కో పరిధిలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు డంపింగ్ యార్డ్‌కి అవసరమైన స్థలాన్ని పరిశీలించిన స్థలాలతో ఒక నివేదిక తయారుచేసి ఏపీ జెన్కో యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు సమాచారం. పర్యటనలో సీలేరు కాంప్లెక్స్ ఎస్సీ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి ఇఇ భాస్కరరావు, ఎడిఇ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-జికెవీధి: మండలంలో సిఐటియు కార్యాలయంలో అప్పల నరస ఆధ్వర్యంలో మహాసభ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ కార్మికులు సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాల ఆలోచన విధానాల వల్ల పరిష్కారం కావడం లేదని మండిపడ్డారు. కార్మికులు అంతా ఒక తాటిపైకి వచ్చి బలమైన పోరాటాలు చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సిఐటియు మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ, మండల అధ్యక్షులు వెంకటి తదితరులు పాల్గొన్నారు.

చింతల కొలువు..చింతూరు సంత

చింతూరు సంత అంటేనే సందడి. ఏజెన్సీలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి అన్ని రకాల వస్తువులు విక్రయించేందుకు గిరిజనులు తెస్తుంటారు. పుట్టతేనె, విప్పపూలు, అడవిదుంపలు, రాజ్‌మా, అల్లం, పసుపు, మొక్కజొన్నలు, మిరియాలు ఇలా ఒకటేమిటి అన్ని రకాల మసాల దినుసులు సైతం ఇక్కడ లభ్యమవుతాయి. సంతే కదా అని సింపుల్‌గా తీసిపారేయొద్దు. ఈ సంతకు చత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారాలు చేసేందుకు పలువురు వ్యాపారులు వస్తుంటారు. టూకీగా చెప్పాలంటే సంత అంటే సూపర్‌మార్కెట్ లెక్క. అలాంటి చింతూరు సంతపై మనమూ ఓ లుక్కేద్దాం..

వర్షం వస్తే అవస్థలు
బురదమయమవుతున్న మార్కెట్
సరైన స్టాళ్లు లేక అమ్మకందారులకు ఇబ్బంది

ప్రజాశక్తి - చింతూరు : ఏజెన్సీలోని చింతూరు సంత బాగా ప్రసిద్ధమైనది. చిరు వ్యాపారులు అంతా ఒకచోట చేరి తమ వస్తుసామగ్రిని విక్రయించుకుని నాలుగు రూపాయలు తీసుకుని వెనుదిరుగుతుంటారు. ప్రతి బుధవారం శబరి నది ఒడ్డున జరిగే వారాంతపు సంతకు చత్తీస్‌గఢ్, ఒరిస్సా తెలంగాణ రాష్ట్రాల నుండి చిరువ్యాపారులు చిన్నచిన్న గుడారాలు వేసుకొని వ్యాపారాలు చేస్తుంటారు. చుట్టుపక్కల ఆదివాసీల గ్రామాలు వందకు పైగానే ఉన్నాయి. బుధవారం జరిగే సంతకు అధికశాతం గిరిజనులు విచ్చేస్తారు. గిరిజనులు అడవిలో సేకరించే వెదురు అల్లికలు, విప్ప పూలు, విప్పకాయలు, కూరగాయలు, అడవిదుంపలు వంటివి తీసుకువచ్చి సంతలో పోగులు పోసి విక్రయిస్తుంటారు. వర్షాకాల సమయంలో పుట్టలో ఉన్న రెక్కలచీమలు (ఈసుళ్లు)ను నిప్పులపై కాల్చి ఆకుల దుప్పలలో వేసి విక్రయిస్తుంటారు. తునికికాయలు, పాలపండ్లు, నేరేడు, జిన్ని పండ్లు వంటివి సీజన్ వారీగా లభించే వాటిని కూడా సంతలో విక్రయించి వచ్చిన డబ్బులతో నిత్యావసర సరుకులు, చేపలు, ఎండు మిరపకాయలు,కొనుగోలు చేసుకుంటారు. కొండలపై ఉన్న కొండరెడ్లు వారానికి ఒకసారి కొండదిగి సంతకు చేరుకొని వారు సేకరించిన తేనె, మైనం విక్రయించి వారానికి సరిపడా ఆహార పదార్థాలను కొనుగోలు చేసుకుంటారు.



సంతలో బురదమయమైన దారి

సంత పాట లక్షల్లో ఉన్నా... సౌకర్యాలు సున్నా..

చింతూరు సంత వేలం పాట ప్రతి ఏడాది లక్షల్లో పెరుగుతున్నా దానికి తగిన సౌకర్యాలు మాత్రం ఉండడం లేదని పలువురు చిరు వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో సరైనషెడ్లు లేక ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ బురద నీటిలో నడుస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి ఏట సంభవించే వరదలకు సంత ప్రాంతం మొత్తం ముంపునకు గురవుతుంది. బురదమయంగా మారుతుంది. చిరువ్యాపారుల సరుకులు పాడైపోయి నష్టపోతున్నారు. సరైన షెడ్లు కూడా ఏర్పాటు చేయకపోవడం వలన వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. శానిటేషన్ పనులు కూడా అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. సంతలోనికి ప్రధాన రహదారి గుండా వెళ్లేందుకు రాంపు లేకపోవడంతో వర్షాకాలంలో పలువురు జారిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని షెడ్లు నిర్మించడంతో పాటు, తాగునీటి సౌకర్యం కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.



సరుకులు విక్రయిస్తున్న మహిళ

నీడ కోసం ప్లాస్టిక్ కవర్లు వేసుకుంటున్నాం



ప్రతివారం సంతకు ఆసీలు వసూలు 80 రూపాయలు వసూలు చేస్తున్నారు. కానీ ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదు వర్షాకాలం సొంతంగా మేమే ప్లాస్టిక్ కవర్లు వేసుకుని ఉంటున్నాం వేసవికాలంలో అయితే ఎండలోనే కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. పారిశుధ్య కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదు. ఆదాయం మాత్రం లక్షల్లో వస్తుంది. వ్యాపారులకు మాత్రం సౌకర్యాలు ఉండటం లేదు.

- అరవింద కుమార్, కూరగాయల వ్యాపారి, చింతూరు

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే వర్షాకాలంలో వ్యాధులు నియంత్రించవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎపిఆర్ కళాశాల మైదానంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ పెడుతోందని పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి స్పష్టం చేసారు. మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిశ్రీ వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంపై అవగాహన కల్పించారు. అనంతరం కుమ్మరిపుట్టులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా పంచాయతీ అధికారి కె.పి.చంద్ర శేఖర్, గ్రామీణనీటి సరఫరా విభాగం ఇఇ నాగేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి విశ్వేశ్వరనాయుడు, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి టి.ప్రతాప్, జిల్లా మలేరియా అధికారి తులసి, డిఇఓ పి.బ్రహ్మాజీరావు, ఎంపిడిఓ తేజరతన్, తహశీల్దార్ డి.అరుణ్ చంద్ర, చింతల వీధి సర్పంచ్ సీతమ్మ, లగిశపల్లి సర్పంచ్ పార్వతమ్మ, ఎంపిటిసి గిడ్డి విజయలక్ష్మి, మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి తదితరులు పాల్గొన్నారు..

విఆర్‌పురం: మండలంలో ప్రతీ నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం మండలంలో ధర్మతాల్లగూడెంలో ఎంపిడిఓ ఇమాన్యుయెల్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపిపి కారంలక్ష్మి, ఎపిఒ జగన్నాథరావు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ధర్మతాళ్ళగూడెం ఎంపిపి స్కూల్ సందర్శించారు. పీసా ఉపాధ్యక్షులు సున్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్, టిడిపి మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్‌ఖాన్ తెలిపారు. అధికారులు ఎస్టీ కాలనీలో స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.


అంగన్వాడికేంద్రం వద్ద దోమమందు పిచికారి చేశారు. ఎంపిడిఓ శ్రీనివాస్‌దొర, డిప్యూటీ డిఎంహెచ్ఓ పుల్లయ్య, ఐసిడిఎస్ సిడిపిఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గంగరాజు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పి ఆధ్వర్యంలో

అడిషనల్ ఎస్పి పంకజ్‌కుమార్‌మీనా ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ క్యాంపస్‌లో స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అడిషనల్ ఎస్పీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా శనివారం మారేడుమిల్లి మండల పరిధిలో ఎంపిడిఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడొద్దు పర్యావరణాన్ని నష్టపరచొద్దని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ప్రధానమని తెలిపారు. ఎంఇఓ ముత్యాలరావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీకే వీధి: మండలంలోని రింతాడలో ఉపసర్పంచ్ సోమేష్ కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది,ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బ్లీచింగ్ చల్లించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



చింతూరు : ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



మారేడుమిల్లి : ప్లాస్టిక్ వాడొద్దని నినాదాలు చేస్తున్న సిబ్బంది



విఆర్‌పురం: మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి